# జీడికి దక్కని గిట్టుబాటు!

- ఆందోళనలో రైతులు
- 80 కిలోలకు రూ. 16 వేలు ఇవ్వాలని డిమాండ్

పలాస:

ఉద్దానం ప్రాంతంలోని రైతులకు జీడిపంటే ప్రధాన జీవనాధారం. ప్రకృతి పగబట్టిన, చీడపీడలు దాడి చేసిన.. వాటిని ఎదుర్కొని జీడి సాగును వ్యసనంగా చేసుకొని ముందుకుసాగు సాగుతున్నారు. ఇంత చేస్తున్న కష్టానికి తగిన ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 80 కిలోల జీడిపిక్కలకు కనీస మద్దతు ధర రూ. 16 వేలు ఇవ్వాలని కొన్నేళ్లుగా చేస్తున్న పోరాటాలు ఫలించలేదు. 2018 అక్టోబర్ నెలలో వచ్చిన తిత్లీ తుఫాన్ సమయంలో జీడితోటలు నేలకొరిగాయి. దీంతో అనేక కష్టాలు పడి కొత్తగా మొక్కలను నాటి వాటిని సంరక్షించుకొని తోటలుగా తయారు చేసుకున్నారు. గతంలో కంటే జీడి సాగుకు పెట్టుబడులు పెరిగినప్పటికీ పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. పలాస నియోజకవర్గంలోని పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో సుమారు 11 వేల హెక్టార్లలో జీడి పంట సాగవుతోంది. ఏటా మార్చి నుంచి జూన్ వరకు పంట వస్తుంది. ప్రస్తుతం చీడపీడల నుంచి పంటను కాపాడు కోవడం కోసం క్రిమిసంహారక మందులను పిచికారీ చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అలాగే జీడితోటల్లో ఆకులు ఒక చోట పోగేసి మట్టి కప్పడం తదితర పనులను చేస్తున్నారు. వీటికి ఎకరాకి కనీసం రూ.3 వేలు ఖర్చు అవుతోంది. అలాగే అక్టోబర్, నవంబర్ నెలల్లో దుక్కులు, చెట్లు మలుపునకు ఎకరాకి కనీసం రూ.5 వేలు పెట్టుబడి పెట్టారు. ఈ విధంగా పెట్టుబడులు పెడుతున్నా తగిన గిట్టుబాటు కావడం లేదని రైతులు చెబుతున్నారు. జీడి పిక్కలకు కనీస మద్దతు ధర ఇవ్వాలనే డిమాండ్‌తో రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నాలు, నిరాహార దీక్షలు చేస్తూనే ఉన్నారు. అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. అయినా ఫలితం లేదు. జీడికి గిట్టుబాటు ధర కల్పించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అసెంబ్లీలో కూడా మాట్లాడినప్పటికీ ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకుంది. గత ఏడాది జూన్‌లో 80 కిలోల జీడి పిక్కల ధర బస్తా రూ.12 వేలు ఉండగా ప్రస్తుతం రూ.14 వేలు ఉంది. అన్ని పంటలకు ప్రభుత్వం ధర నిర్ణయించగా పలాసలో జీడి పిక్కలకు మాత్రం పలాస కాష్యూ అసోసియేషన్ నిర్ణయిస్తుంది. రైతు చేతికి జీడిపంట వస్తున్న సమయంలో ఉండే ధర.. ఉగాది తర్వాత ఆమాంతంగా కిందికి పడిపోతుంది. దీని వెనుక పలాస జీడి వ్యాపారుల సిండికేటు వ్యవహారమని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వమే ఈ ధరను మార్కెట్ కమిటీల ద్వారా నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాదైనా గిట్టుబాటు ధర ప్రకటించాలని కోరుతున్నారు.


మద్దతు ధర ప్రకటించాలని ఆందోళన చేస్తున్న జీడిరైతులు (ఫైల్)


జీడి పిక్కలను చూపిస్తున్న రైతు

పలాస నియోజకవర్గంలో జీడి సాగు ఇలా..

| మండలం | మందస | పలాస | వజ్రపుకొత్తూరు |
|---|---|---|---|
| సాగువిస్తీర్ణం హెక్టార్లలో.. | 3,500 | 1200 | 6,000 |


జీడి పిక్కలను బస్తాల్లో నింపుతున్న మహిళా రైతులు

### కాష్యూ బోర్డును ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం కాష్యూబోర్డును ఏర్పాటు చేయాలి. రైతులకు తగిన గిట్టుబాటు ధరలను కల్పించాలి. రైతు సేవా కేంద్రాల ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేయాలి. కనీసం గిట్టు బాటు ధర 80 కిలోల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలి. రైతులకు పెట్టుబడి రుణం బ్యాంకుల ద్వారా ఇప్పించాలి.

– వంకల మాధవరావు, జిల్లా కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, పలాస

### ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



ఉద్దానం ప్రాంతంలో జీడి రైతులను దళారీలు దోపిడీ చేస్తున్నారు. ఈ వ్యవస్థను నిర్మూలించాలి. అందుకు ఏకైక మార్గం జీడి డిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయడంతో పాటు ధరను నిర్ణయించాలి. జీడి పిక్కల ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి కనీసం రూ.50 లక్షలు ఆదాయం చేకూరుతోంది. అయినా ప్రభుత్వం నుంచి రైతులకు ఎటువంటి మేలు లేదు.

– అంబటి రామక్రిష్ణ, రైతు, దోకులపాడు, వజ్రపుకొత్తూరు

## క్లుప్తంగా

### ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎన్.శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో చేరేందుకు పదో తరగతి పూర్తిచేసిన ఓసీ, బీసీ, ఈడబ్ల్యూస్ విద్యార్థులు రూ. 200, ఎస్సీ, ఎస్టీ వారు రూ. 150 చొప్పున దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 17 నుంచి 22వ తేదీలోగా నెట్‌బ్యాంకింగ్/క్రెడిట్ కార్డు/డెబిట్‌కార్డులు ద్వారా చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 99859 75684, 94900 42269, 94949 56665 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### నేడు ప్రజావేదిక

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని 21 పంచాయతీల్లో గత నెల రెండు నుంచి 16వ తేదీ వరకు నిర్వహించిన ఉపాధి పనుల సామాజిక తనిఖీకి సంబంధించి శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.రామారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి 17వ విడత సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగిందని, అందుకు సంబంధించిన వివరాలను ప్రజావేదిక ద్వారా ప్రజలకు వివరిస్తామన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించబోయే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ఉపాధి వేతనదారులు హాజరు కావాలని కోరారు.

### పలాసలోనే ఆర్టీవో సేవలు అందించాలి

పలాస: పలాస కేంద్రంగా ఆర్టీవో సేవలను అందించాలని ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు డిమాండు చేశారు. ఈ మేరకు కాశీబుగ్గ బస్టాండు వద్ద ధర్నా చేసి మాట్లాడారు. ఆటో డ్రైవర్లు శ్రీకాకుళం వెళ్లి ఫిట్‌నెస్ చేయించుకోవడం కష్టంగా ఉందన్నారు. 250 కిలోమీటర్లు వెళ్లాలంటే ఆర్థిక ఇబ్బందులు ఉంటాయన్నారు. ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు పోతనపల్లి మల్లేశ్వరరావు, వంకల అప్పారావు, వంకల క్రిష్ణారావు, పాపారావు ఉన్నారు.

### మొక్కలు నాటివేత


మొక్కలు నాటుతున్న కమిటీ సభ్యులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నెమలికొండ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కమిటీ సభ్యులు శుక్రవారం మొక్కలు నాటారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులంతా దాతలు అందించిన మొక్కలను నాటి రక్షణ కవచాలు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ నీడనిచ్చే మొక్కలతో పాటు పూల మొక్కలు నాటారు.

### మండల సర్వసభ్య సమావేశం రేపు

నందిగాం: నందిగాం మండల సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రాజారావు శుక్రవారం తెలిపారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి అన్ని విభాగాల అధికారులు, సభ్యులు హాజరు కావాలన్నారు.

### మంత్రి వినతుల స్వీకరణ


ఫీల్డ్ అసిస్టెంట్లకు నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: కోటబొమ్మాళి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మంత్రి అచ్చెన్నాయుడు ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారంపై అధికారులతో మాట్లాడారు. అలాగే వివిధ పంచాయతీకు ఫీల్డ్ అసిస్టెంట్లను ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు.

### విద్యార్థులతో కూటమి సర్కార్ చెలగాటం



మాట్లాడుతున్న దుర్యోధనరావు

కాశీబుగ్గ: ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా కూటమి సర్కార్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విఫలమయ్యారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయన్నారు. అలాగే నిరుద్యోగ భృతి కూడా ఇవ్వకపోవడంతో నిరుద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలులో చంద్రబాబు సర్కార్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.

# సారా రహిత గ్రామాలే లక్ష్యం


ఈదుపురంలో మాట్లాడుతున్న సీఐ పీడీ ప్రసాద్

ఇచ్ఛాపురం రూరల్: నాటుసారా రహిత పల్లెలుగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.డి.ప్రసాద్ అన్నారు. ఈదుపురం, బాలకృష్ణాపురం, కవిటి మండలం దూగానపుట్టుగ, సన్యాసిపుట్టుగ గ్రామాల్లో 'నవోదయం–2.0' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నవ సమాజానికి నాంది నవోదయం అన్నారు. సారా రహిత పల్లెలుగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. దేశానికి యువత అత్యుత్తమమైన సంపదని అన్నారు. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చాలా మంది ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని, యువకులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. గ్రామాలను సారా రహితంగా తీర్చిదిద్దేందుకు 'నవోదయం 2.0'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.సిహెచ్.వి.రమణారావు, సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్‌రావు, దూగాన బద్రాచలం, వీర్వో ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.

### మంచినీళ్లపేట సర్పంచ్ మృతి


సత్యరాజులు (ఫైల్)

వజ్రపుకొత్తూరు: మండలంలోని మంచినీళ్లపేట పంచాయతీ సర్పంచ్ వంక సత్యరాజులు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన పదేళ్లుగా వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేశారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు ప్రధాన అనుచరుడు. సత్యరాజులు మృతి సమాచారం తెలిసిన వెంటనే వైఎస్సార్‌సీపీ నాయకులు మంచినీళ్లపేట గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. పరామర్శలో మండల పార్టీ అధ్యక్షుడు తిర్రి రాజారావు, మాజీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు, వైస్ ఎంపీపీ వంక రాజు తదితరులు ఉన్నారు.

### విద్యార్థుల క్షేత్ర పరిశీలన


వెదురు బుట్టల అల్లికలను పరిశీలిస్తున్న విద్యార్థులు

కాశీబుగ్గ: మందస మండలం కుంటికోట నారాయణ హస్కూల్‌లో చదువుతున్న ఏడో తరగతి విద్యార్థులు క్షేత్రపరిశీలన నిమిత్తం శుక్రవారం శారంగిపురం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడి కళాకారులు తయారు చేస్తున్న హస్తకళలు, చేతివృత్తుల పనులను పరిశీలించారు.ఉపాధ్యాయులు వీటి గురించి పిల్లలు అర్థం చేసుకునేలా అవగాహన కల్పించారు. కుంభార కళ (పాట్టారి), వెదురు, అలంకార వస్తువుల తయారీని చూపించారు.

# ప్రతి మహిళా వాణిజ్యవేత్త కావాలి


మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: ప్రతి మహిళా వాణిజ్యవేత్తగా ఎదగాలని సెర్ప్ ఏపీఎం ససపల ప్రసాదరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆర్ష్ స్వచ్ఛంద సేవా సంస్థ, స్లాక్ స్వేచ్ఛ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో డొంకూరు మత్స్యకార గ్రామంలో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల హక్కులు, గృహహింసా చట్టాలు, వాణిజ్య, వ్యాపార రంగాల్లో స్థరపడేందుకు అవసరమైన సూచనలు, సలహాలు తెలియజేశారు. ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ విధానం (ఓఎన్‌డీసీ) ద్వారా ఇంటి వద్ద ఉత్పత్తి చేసే వస్తువులను ఆన్‌లైన్‌లో ఎలా మార్కెటింగ్ చేసుకోవాలన్న అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆర్ష్ సంస్థ ప్రతినిధి ధనలక్ష్మి, హెచ్‌ఓఏ శివానీ, సీఈఓలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## హోలీ..ఆనందకేళీ..

హోలీ పండుగను ప్రజలు శుక్రవారం ఆనందంగా జరుపుకున్నారు. చిన్నా..పెద్దా తారతమ్యం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ సందడిగా గడిపారు. వాహనాలపై యువకులు తిరుగుతూ హడావుడి చేశారు. ఈ సందర్భంగా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఇచ్ఛాపురం స్వేచ్ఛానగర్‌లో జేసీఐ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంగీతం, నృత్య ప్రదర్శనలతో యువతీ యువకులు ఆకట్టుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


ఇచ్ఛాపురం టౌన్: హోలీ వేడుకల్లో జేసీఐ సంస్థ ప్రతినిధులు, కుటుంబీకులు


టెక్కలిలో రంగులు చల్లుకుని హోలీ చేసుకుంటున్న యువకులు


పలాస: మామిడిపల్లిలో హోలీ వేడుకల్లో చిన్నారులు


కవిటిలో హోలీ జరుపుకుంటున్న విద్యార్థులు


ఇచ్ఛాపురం రూరల్: కేశుపురంలో హోలీ సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం


వజ్రపుకొత్తూరు రూరల్: చినవంకలో సందడి చేస్తున్న చిన్నారులు


కాశీబుగ్గ: హోలీ ఆడిన ఓ కుటుంబం


కంచిలి: హోలీ ఆడుతున్న యువకులు

## మానవ సేవయే మాధవ సేవ



మానవుడు సేవా మార్గంలో సాగాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం సత్యసాయి మందిరంలో కన్వీనర్ జగ్గునాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మహిళా సదస్సులో ఆయన మాట్లాడారు. మానవ సేవయే మాధవ సేవగా భావిస్తూ సత్యసాయి సేవా సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మహిళలు నైతిక విలువలు, సత్ప్రవర్తన కలిగి కుటుంబాన్ని, సమాజాన్ని వృద్ధిలోకి తీసుకురావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, సత్యసాయి రాష్ట్ర సేవాదళ్ కన్వీనర్ నాగేశ్వరరావు, జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త అరుణ, అన్నపూర్ణమ్మ, కమల త్రివేది, కొంచాడ నూకరాజు, వెంకటరావు, గోవిందరావు, మహిళా ప్రతినిధులు సుకన్య, విజయలక్ష్మి, నాగమణి, దేవి పాల్గొన్నారు.

–వజ్రపుకొత్తూరు

## వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



భగత్‌సింగ్ సంస్మరణ సభ వాల్ పోస్టర్లు, కరపత్రాలను దేశభక్త ప్రజాతంత్ర నాయకులు పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎం జిల్లా కార్యదర్శి సాలిన వీరాస్వామి మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీ ఉదయం పది గంటలకు మాకన్నపల్లిలో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేల సంస్మరణ సభను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ముగ్గురు వీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, ఆ వీరుల స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రతినిధులు లక్ష్మణరావు, బుడత బాలరాజు ఉన్నారు.

–పలాస

## భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



టెక్కలిలోని తెలుగు బ్రాహ్మణవీధిలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో సౌభాగ్యలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. అనంతరం చండీ హోమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

–టెక్కలి

# సినీనటుడు అమ్మరామకృష్ణకు సత్కారం


రామకృష్ణను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కాశీబుగ్గ: పలాస మండలం పెద్దనారాయణపురం గ్రామంలో జరుగుతున్న డోలోత్సవాల్లో సినీనటుడు, జానపద కళాకారుడు అమ్మరామకృష్ణ ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూసుకోవాలని, మద్యానికి దూరంగా ఉండాలనే సందేశం ఇస్తూ సాగిన ఏకపాత్రాభినయం ఆకట్టుకోవడంతో కమిటీ సభ్యులు అతన్ని సత్కరించారు. కార్యక్రమంలో బంటుకొత్తూరు పంచాయతీ సర్పంచ్ పిట్ట షణ్ముఖరావు, గ్రామ పెద్దలు ఉమాచరణ్ పండా, గౌరీ శంకర్ పండా, రవిరంజన్ పండా తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా డోలోత్సవం


స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తజనం

కవిటి (ఇచ్ఛాపురం రూరల్): కవిటి మండలం బెజ్జిపుట్టుగలో శుక్రవారం జరిగిన డోలోత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చారు ఇచ్ఛాపురం, పలాసతో పాటు ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు చక్రపెరుమాళ్ల స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. యాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కవిటి పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. సీఐ ఎం.చిన్నంనాయుడు, ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు. కాగా చక్రపెరుమాళ్ల స్వామిని ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులు, ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నంనాయుడు, ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్, సర్పంచ్ ఎస్పీ నారాయణస్వామి, మాజీ ఎంపీపీ నర్తు చమాంతి, వైస్ ఎంపీపీ కె.గోపయ్య, ఎంపీటీసీ సభ్యుడు రామయ్య, జిల్లా విద్యార్థి సంఘ అధ్యక్షుడు కర్రి దీనబంధులు స్వామి వారిని దర్శించుకున్నారు.

# శ్మశానవాటికకు రోడ్డు వేయండి


మృతదేహాన్ని పొలాల్లో నుంచి తీసుకెళ్తున్న దృశ్యం

నందిగాం: మండలంలోని ఆనందపురం పంచాయతీ సవరబాణాపురం గ్రామంలోని శ్మశానవాటికకు రహదారి ఏర్పాటు చేయాలని ఉప సర్పంచ్ పి.జోగారావుతో పాటు గ్రామస్తులు కోరారు. గ్రామానికి చెందిన పైల చంద్రమ్మ శుక్రవారం మృతి చెందారు. మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో కుటుంబ సభ్యులు అవస్థలు పడ్డారు. గత్యంతరం లేక పొలం గట్లపై నుంచి తీసుకొని వెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు. ప్రస్తుతం పంటల్లేకపోవడంతో మృతదేహాన్ని ఏదోఒకలా శ్మశానవాటికకు చేర్చామని.. అదే వర్షాకాలంలో అయితే పరిస్థితి వేరేలా ఉండేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి శ్మశానవాటికకు రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు.

# చెడు వ్యసనాలకు బానిస కావద్దు

కాశీబుగ్గ: యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు అన్నారు. పలాసలో శుక్రవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సూర్యనారాయణ, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రరావు ఆధ్వర్యంలో చెడు వ్యసనాలకు ఎలా దూరంగా ఉండాలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలాస, టెక్కలి డివిజన్ పరిధిలో ఉండే మందుల వ్యాపారస్తులకు నార్కోటిక్ అండ్ సైకోట్రోపిక్ (ఎన్‌డీపీఎస్)యాక్ట్‌పై అవగాహన కల్పించారు. టెక్కలి డివిజన్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎన్.యుగంధర్, పార్వతీపురం డివిజన్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఆశాషేక్, ఏపీ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి కె.కరుణ్ కుమార్ గుప్తా, జిల్లా అధ్యక్షులు శిష్టు జగం, టెక్కలి నాయకుడు తర్లన అశోక్, శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.